గుంతలు పడిన బీర్సాయిపేట్ రోడ్డు

రోడ్డుకు మరమ్మతులు చేయండి

ఉట్నూర్ మండలం బీర్సాయిపేట్ గ్రామ ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు. ఇటీవల ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ప్రధాన రహదారిపై గోతులు ఏర్పడడంతో వాహనదారులు పడిపోయి గాయాలైన సంఘటనలు అనేకం ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతులలో ఏర్పడిన దుమ్ముధూళితో ఓ వ్యాపారి ప్రాణపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. ఇప్పటికైన ఆర్అండ్బీ అధికారులు స్పందించి రోడ్డు వేయాలని కోరుతున్నారు. దీనికి స్థానిక ఎమ్మెల్యే స్పందించి చొరవ చూపాలని కోరుతున్నారు.

- ఉట్నూర్, జూన్ 4

అంగన్‌వాడీలో పర్యావరణ దినోత్సవం

కుభీర్, జూన్ 4: కుభీర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం-1లో మంగళవారం జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులకు మొక్కలకు నీరు పోయడం, వాటిని సంరక్షించడంతో పాటు మట్టి ముద్దల్లో వివిధ రకాల విత్తనాలను నాటి అందించారు. ఇండ్లలోని పెరట్లలో వాటిని నాటాలని అంగన్‌వాడీ టీచర్ సత్యశీల చిన్నారులకు సూచించారు.

మట్టి ముద్దల్లో విత్తనాలు నాటి చిన్నారులకు అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్

సహజ ఆహారం తీసుకోవాలి

విద్యార్థులకు వివరిస్తున్న నాయకులు

ఉట్నూర్, జూన్ 4: సహజ ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నూతుల రవీందర్, సైన్స్ మేజిషియన్ రాజు అన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని కుమ్రం భీం ప్రాంగణంలో నిర్వహిస్తున్న వికాసం సమ్మర్ క్యాంపు విద్యార్థులకు నిత్యం జీవితంలో మూఢ నమ్మకాలను ఏలా ఎదుర్కొని ముందుకు సాగాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకోవడం ఎలా అనే అంశంపై వివరించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బాదు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉట్నూర్, జూన్ 4: ఉట్నూర్‌లోని విద్యుత్ లైన్‌లో మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రావణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్, లక్కారం, బీర్సాయిపేట్, దంతన్‌పల్లితో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

6న ఇంటర్ అడ్మిషన్లకు స్పాట్ కౌన్సెలింగ్

ఉట్నూర్, జూన్ 4: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 2024-25కి గాను ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో మిగిలిన సీట్లకు గురువారం స్థానిక లాల్‌టెకిడీ గిరిజన బాలుర కళాశాలలో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ సర్టిఫికెట్లు రెండు జతల జిరాక్స్, 4 పాస్‌ఫోటోలు, నిజధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

మామిడి మొక్కల కోసం సంప్రదించండి

ఉట్నూర్, జూన్ 4: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్, భీమారం, బెల్లంపల్లి, జంబుగలోని నాలుగు ఉద్యానవన నర్సరీ, శిక్షణ కేంద్రాలు (హెచ్ఎన్‌టీసీ)లో మామిడి, పూల, అలంకారణ మొక్కలు అందుబాటులో ఉన్నాయని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నర్సరీల్లో మార్కెట్ ధరకంటే తక్కువకే దొరకడంతో పాటు నాణ్యమైనవి ఉన్నాయని పేర్కొన్నారు. మరిని వివరాలకు ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ ప్రాజెక్ట్ ఉద్యానవన శాఖ అధికారి సందీప్ కుమార్, సుధీర్ కుమార్ 9032313933 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు కరాటే శిక్షణ ముగింపు వేడుకలు

నిర్మల్ అర్బన్, జూన్ 4: ఝాన్సీ లక్ష్మీబాయి కరాటే శిక్షణ సమితి ఆధ్వర్యంలో మహిళల ఆత్మరక్షణ కోసం మే 24వ తేదీన ప్రారంభమైన వేసవి ఉచిత శిక్షణ శిబిరం ముగింపును బుధవారం పట్టణంలోని ఆర్‌కే కన్వెన్షన్ హాల్‌లో సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించనున్నట్లు కరాటే శిక్షకురాలు కిన్నెర్ల మృణాళిని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ జానకి షర్మిల, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ధ పద్మ, రాజుల్‌వార్ దిగంబర్ హాజరవుతున్నారని పేర్కొన్నారు.

నత్తనడకన బడుల పనులు

- ఏడు రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్న పూర్తి కాని పనులు

మరమ్మతు దశలో తాడిహత్నూర్ జిల్లా పరిషత్ పాఠశాల

నార్నూర్, జూన్ 4 : ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమ్మ ఆదర్శ పథకం కింద నార్నూర్, గాదిగూడ మండలాల్లోని 87 పాఠశాలల్లో మరమ్మతుల కోసం రూ.2 కోట్ల వరకు కేటాయించింది. ఇందులో 25 శాతం నిధులు విడుదల చేయడంతో పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కాకముందే పనులు పూర్తి చేయాల్సి ఉంది. గతంలో మన ఊరు-మన బడి ద్వారా 17 పాఠశాలలను ఎంపిక చేసి వాటికి కొన్ని నిధులు విడుదల చేశారు. పనులు కొంతమేర జరిగినప్పటికీ పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో వాటిని మూసివేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో మైనర్ మరమ్మతుల కోసం అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేసి పనులు ప్రారంభించింది. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా, వీవోతో పాటు ప్రతి పాఠశాలకు ముగ్గురు చొప్పున విద్యార్థుల తల్లులు కమిటీ సభ్యులుగా ఎన్నుకొని అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో నార్నూర్, గాదిగూడ మండలాల్లోని మొత్తం 87 పాఠశాలల్లో తాగునీరు, సంపుల నిర్మాణాలు, కరెంట్‌తో పాటు చిన్నపాటి మరమ్మతులను సకాలంలో పూర్తి చేయాల్సి ఉండగా..అన్ని పాఠశాలల్లో పనులు పూర్తికాక వివిధ దశల్లో దర్శనమిస్తున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభానికి ఏడు రోజులు మాత్రమే మిగిలి ఉండగా మరమ్మతులు కొనసాగుతున్నాయి. పలు పాఠశాలలో నాణ్యత కూడా పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. త్వరలోనే అమ్మ ఆదర్శ ద్వారా ఎంపికైన పాఠశాలల్లో మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగించేలా చూడాలని విద్యార్థులు తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. ఇట్టి విషయంపై ఏఈ రాథోడ్ సునీల్‌ను వివరణ కోరగా వారం రోజులలోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తండ్రి మృతదేహం వద్ద ఇద్దరు కుమార్తెలు

అనాథలైన కుమార్తెలు

కుంటాల, జూన్ 4 : మండల కేంద్రంలోని సాంగి శ్రీనివాస్ (40) అనారోగ్యంతో మంగళవారం ఇంటి వద్ద మృతి చెందాడు. గతంలో ఇతని భార్య కూడా అనారోగ్యంతో కన్నుమూసింది. దీంతో పట్టుకతోనే దివ్యాంగులైన ఇద్దరు కుమార్తెలు అనాథలుగా మిగిలిపోయారు. చలించిపోయిన గ్రామస్తులు రూ. లక్షకు పైగా విరాళాలు సేకరించి అంత్యక్రియలు నిర్వహించారు. భవిష్యత్‌లో కూడా వారిని అన్ని విధాల ఆదుకుంటామని అన్నారు. దాతలు ఎవరైనా ఉంటే 8186064040 ఫోన్ పే నంబర్‌పై సాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

బర్రెను ద్విచక్ర వాహనం ఢీ కొని ఒకరి మృతి

ఉట్నూర్ రూరల్, జూన్ 4: ఏందా గ్రామ సమీపంలో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం బర్రెను ఢీ కొని ఒకరు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. ఇంద్రవెల్లి మండలం వాల్గొండ గ్రామానికి చెందిన మడావి మారుతి(32), మడావి వసంత్ ద్విచక్రవాహనంపై కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణికి బంధువుల పెళ్లి కార్యక్రమానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఏందా గ్రామ సమీపంలో బర్రెను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో మారుతి అక్కడికక్కడే మృతి చెందాడు. వసంత్‌కు గాయాలు కాగా స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ రాథోడ్ కృష్ణ, పైలెట్ ఆత్రం అశోక్ అక్కడికి చేరుకొని అంబులెన్స్‌లో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మారుతికి భార్య రాధాబాయి, కుమారుడు ఉన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

బోథ్, జూన్ 4 : మండలంలోని కోట గ్రామానికి చెందిన జల్కే ఆకాశ్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్కే ఆకాశ్ కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య అనసూయ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

రేకుల షెడ్డు దగ్ధం

మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

భైంసాటౌన్, జూన్ 4 : భైంసా మండలం సిద్దూర్ గ్రామంలో మంగళవారం పంచశీల సురేశ్‌కు చెందిన రేకుల షెడ్డు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సకాలంలో వారు అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సమీప ఇండ్లకు మంటలు వ్యాపించకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327729-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

ఎన్ఎఫ్ఐడబ్ల్యూ ఆవిర్భావ దినోత్సవం

జెండా ఎగురవేస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ముడుపు నళిని రెడ్డి

ఎదులాపురం, జూన్ 4 : ఆదిలాబాద్‌లో భారత మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీపీఐ పార్టీ కార్యాలయంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జెండాను రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ముడుపు నళిని రెడ్డి ఎగురవేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమీనా ఖాన్, కృష్ణవేణి షబానా, పుష్ప, అరుణ, రాణి తదితరులు పాల్గొన్నారు.

సంత్ కబీర్ దాస్ బోధనలు స్ఫూర్తిదాయకం

కబీర్‌దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బౌద్ధ చార్యులు

భైంసా, జూన్ 4: సంత్ కబీర్ దాస్ బోధనలు స్ఫూర్తిదాయకమని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా బౌద్ధచార్యులు ప్రసన్నజిత్ హెమ్లే అన్నారు. భైంసాలోని ఏపీనగర్, రాహుల్‌నగర్‌లో మంగళవారం బీఎస్ఐ ఆధ్వర్యంలో మహాకవి సంత్ కబీర్ దాస్ జయంతి నిర్వహించారు. కబీర్ దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాగరబాయి, సంగీత, లక్ష్మణ్ జంగ్మే, తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో పండ్లు పంపిణీ

ఎదులాపురం, జూన్ 4 : దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ జన్మదినం సందర్భంగా మంగళవారం రిమ్స్‌లోని పిలల్ల వార్డులో ట్రస్టు సభ్యులు పండ్లు పంపిణీ చేశారు. అలాగే కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో కేక్‌కట్ చేసి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ కష్టసుఖల్లో అందరికి తోడుగా ఉండే దుర్గం శేఖర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కావటి మోహన్, రఘు, భగవాన్లు, అనుదీప్, మహేశ్, నవీన్, కృష్ణ, మారుతి, సంతోష్, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యుడు కావటి మోహన్

ఏకరూప దుస్తులు గడువులోగా పూర్తి చేయాలి

జైనథ్, జూన్ 4: మహిళా సంఘాల ఆధ్వర్యంలో కుట్టుతున్న ఏకరూప దుస్తులను గడువులోగా పూర్తి చేయాలని ఏపీడీ బండారి నిలేశ్ సూచించారు. మంగళవారం పెండల్‌వాడ గ్రామంలో కుట్టు మిషన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం బడి పిల్లల ఏకరూపు దుస్తులు కుట్టుటకు మహిళా సంఘాలకు అప్పగించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భగవాండ్లు, సీసీ లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న ఏపీడీ నిలేశ్

ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు విత్తనాల పూజలు

పూజలు చేస్తున్న ఆదివాసీ మహిళలు

ఇంద్రవెల్లి, జూన్ 4 : మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీ గిరిజనులు, ఆదివాసీ రైతులు నూతన విత్తనాల పూజలు సంప్రదాయ ప్రకారం నిర్వహించారు. మంగళవారం ఉమ్మడి జిల్లాలోని ఆయా మండలంలోని పలు గ్రామాలతో పాటు ఉట్నూర్, నార్నూర్, గుడిహత్నూర్, జైనూర్ మండలాల నుంచి ఆదివాసీ రైతులు కుటుంబ సమేతంగా ఇంద్రాదేవి ఆలయానికి తరలివచ్చి విత్తనాల పూజలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వానకాలంలో వర్షాలు పుష్కలంగా కురువాలని, సాగు చేసిన పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆదివాసీ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ మహారాజ్ సూర్యరావ్, ఆయా గ్రామాల ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు.

క్షయను నివారించాలి

భీంపూర్, జూన్ 4 : గ్రామాల్లో అందరి సహకారం తీసుకుంటూ క్షయ నివారణకు చిత్తశుద్ధితో పని చేయాలని భీంపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌రాజ్ సూచించారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశ, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్ఎల్‌హెచ్‌పీలకు వయోజన బీసీజీ వ్యాక్సినేషన్ అంశంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సూచించిన 6 అంశాల్లో క్షయ బాధితులను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. లక్ష్య సాధనకు గ్రామస్థాయి అన్ని శాఖల సిబ్బంది సహకారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ గంగాధర్, సిబ్బంది విష్ణు, సంధ్యారాణి, మాయావతి, సాహితి, సరస్వతి, గోదావరి, లచ్చుబాయి, నఫీజ తదితరులున్నారు.

భీమన్న దేవునికి పూజలు చేస్తున్న ముదిరాజ్ కులస్తులు

ఘనంగా భీమన్న పండుగ

ఇచ్చోడ(సిరికొండ), జూన్ 4 : సిరికొండలోని ముదిరాజ్ కులస్తులు మంగళవారం భీమన్న పండగను ఘనంగా నిర్వహించారు. మేకలు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

ఇచ్చోడ, జూన్ 4 : మండల కేంద్రంలో మంగళవారం రూ.2.80 లక్షల నిషేధిత గుట్కా పట్టుకున్నట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన అబ్రార్ మహమ్మద్ మంగళవారం ఇచ్చోడలోని ఎస్ ట్రేడర్స్ కిరాణా షాపులో గుట్కా నిల్వ చేసినట్లు సమాచారం అందింది. ఆ మేరకు తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. గుట్కా విలువ రూ.2.80 లక్షలు ఉంటుందని తెలిపారు. గుట్కా స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్వాధీనం చేసుకున్న గుట్కాతో నిందితుడు, ఎస్ఐ నరేశ్

బీజేపీ నాయకుల సంబురాలు

బోథ్ : సోనాలలో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

బోథ్, జూన్ 4: ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేశ్ విజయం సాధించడంతో మంగళవారం బోథ్ బస్టాండ్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మిఠాయిలు పంచిపెట్టి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

ఇంద్రవెల్లి, జూన్ 4: మండల కేంద్రంలో జడ్పీటీసీ ఆర్కా పుష్పలత, బీజేపీ మండలాధ్యక్షుడు రాజలింగు ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెంబి, జూన్ 4: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బీజేపీ నాయకులు పటాకులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, పుప్పాల రవి, రాజేందర్, విజేందర్ పాల్గొన్నారు.

కుంటాల: కల్లూరులో..

కుంటాల, జూన్ 4 : కల్లూరులో బీజేపీ మండల అధ్యక్షుడు గుద్దేటి నర్సయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు

ఇంద్రవెల్లి, జూన్ 4 : వానకాలంలో పారిశుధ్యం లోపించకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఇంద్రవెల్లి జీపీ ఈవో సంజీవరావ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బుద్ధనగర్, ప్రభుద్ధనగర్, మిలిండ్‌నగర్ కాలనీల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు. వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వార్డులతో పాటు గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మురుగు కాలువల పూడికను తొలగించి శుభ్రం చేస్తున్నామన్నారు. పారిశుధ్య సమస్యలుంటే గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీపీ సిబ్బంది శంకర్‌లాలా, నారాయణ పాల్గొన్నారు.